సాక్షి
తిరుపతి

గురువారం | 4 | సెప్టెంబర్ | 2025



ప్రభుత్వ వైఫల్యంతోనే డయేరియా విజృంభణ

ప్రభుత్వ వైఫల్యంతోనే డయేరియా విజృంభిస్తోందని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు. - 8లో



పోలీసులు ప్రజలతో మమేకం కావాలి

నేరాల నియంత్రణకు పోలీసులు ప్రజలతో మమేకం కావాలని ఎస్పీ పేర్కొన్నారు. - 8లో



ఉడ్ ప్లాంటేషన్‌పై దృష్టి సారించండి

ఉడ్ ప్లాంటేషన్‌పై దృష్టి సారించాలని అటవీశాఖ తిరుపతి సర్కిల్ సీసీఎఫ్ సెల్వం రైతులకు సూచించారు. - 8లో

న్యూస్‌రీల్

పెంచలకోన హుండీ ఆదాయం రూ.1.13 కోట్లు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

రాపూరు : పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని హుండీకి రూ.1.13 కోట్ల ఆదాయం వచ్చిందని ఏసీ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. బుధవారం హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 84 రోజులకు గాను హుండీలు లెక్కించగా రూ. కోటి 13 లక్షలా 12 వేల 632 నగదు వచ్చిందన్నారు. బంగారం 210 గ్రాములా 11 మిల్లీ గ్రాములు, వెండి 4 కిలోలా 250 గ్రాములు వచ్చినట్లు చెప్పారు. అలాగే నిత్య అన్నదానంలోని హుండీలో రూ .4 లక్షలా 65 వేలా 942 వచ్చినట్లు వివరించారు. హుండీ లెక్కింపులో జిల్లాదేవాదాయశాఖ ఏసీ జనార్దన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస బాబు, దేవస్థాన సిబ్బంది, బ్యాంకు, పోలీసులు పాల్గొన్నట్లు వివరించారు.

జీవనోపాధికి కృషి చేద్దాం




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : టూరిజం ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడంతోపాటు పలువురికి జీవనోపాధి కల్పించే దిశగా కృషి చేద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో వన్యప్రాణుల నిర్వహణ విభాగానికి చెందిన అధికారులతో పాటు వ్యవసాయ వాటి అనుబంధ విభాగాలతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారి విభాగాల పరిధిలో పర్యావరణ పరిరక్షణతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేయాలని పేర్కొన్నారు. అందులో భాగంగానే ఉద్యోగ ఉపాధి అవకాశాలకు చోటు ఇవ్వాలని సూచించారు. ఆ దిశగా భవిష్యత్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో వన్యప్రాణుల నిర్వహణ విభాగం అధికారి హారిక, డీఆర్వో నరసింహులు, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ ప్రాజెక్టులో పద్మావతి వర్సిటీకి చోటు

తిరుపతి రూరల్ : శాస్త్రి ఇండో కెనడియన్ ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్‌కు జరిగిన ఎంపిక ప్రక్రియలో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి చోటు దక్కించుకుంది. భారతదేశం నుంచి 30 విశ్వవిద్యాలయాలు దరఖాస్తు చేయగా అందులో నాలుగు విశ్వవిద్యాలయాలను మాత్రమే ఎంపిక చేశారు. ఇందులో జాదవ్ పూర్ యూనివర్సిటీ, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, యూనివర్శిటీ ఆఫ్ ఢిల్లీ ఉన్నాయి. ఈ ఇంటర్నేషనల్ ప్రాజెక్టు వల్ల ట్రైనింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్ అనే థీమ్ పైన కమ్యూనిటీ హెల్త్ అండ్ న్యూట్రీషియన్ , ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ గురించి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ప్రాజెక్టులో కెనడా నుంచి ఇండియాకు , మహిళా యూనివర్సిటీ నుంచి కెనడాకు పరస్పరం ప్రోగ్రామ్స్ చేసుకునేందుకు వీలుంటుందని వర్శిటీ అధికారులు చెప్పారు. ఈ ప్రాజెక్టు సాధనలో మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ ప్రొఫెసర్ విజయలక్ష్మి ప్రాజెక్టు సాధనకు విశేషంగా కృషి చేసినట్టు ఒక ప్రకటనలో వివరించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు



తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 11 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 64,925 మంది స్వామి వారిని దర్శించుకోగా 21,338 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.90 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

రమణీయం..

రథోత్సవం



కాణిపాకంలో వరసిద్ధి వినాయకస్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం రమణీయంగా రథోత్సవం చేపట్టారు. సిద్ధి..బుద్ధి సమేతంగా స్వామివారిని రథంపై కొలువుదీర్చారు. కళాకారులు నృత్యప్రదర్శనలు.. కోలాటాలు.. మంగళవాయిద్యాల నడుమ మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. అశేష భక్తజనులు హాజరై గణనాథుని రథంపై మిరియాలు చల్లుతూ మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లా పండ్ల పరిశ్రమ సంఘం.. ఆల్ ఇండియా ఫుడ్ ప్రాసెసింగ్ అసోసియేషన్ వారు అందించిన మామిడి జ్యూస్‌ను భక్తులకు పంపిణీ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు పకడ్బందీ బందోబస్తు చేపట్టారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం తిరు కల్యాణం.. రాత్రి అశ్వవాహన సేవ నిర్వహించనున్నట్లు ఈఓ పెంచలకిషోర్ తెలిపారు.



- కాణిపాకం

అన్నదాతకు అండగా..



సమావేశమైన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర రెడ్డి, నారాయణస్వామి, రోజా, నేతలు

- పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వైఎస్సార్‌సీపీ పోరుబాట
- మామిడి బకాయిలు వెంటనే విడుదల కోసం
- ఈనెల 9న అన్ని ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసనలు
- తిరుపతి, చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ నేతల సమావేశం

సాక్షి ప్రతినిధి, తిరుపతి : అన్నదాతలకు అండగా వైఎస్సార్‌సీపీ పోరుబాటకు సిద్ధమైంది. కూటమి ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలని నిర్ణయించింది. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 9న తిరుపతి, చిత్తూరు జిల్లాలోని ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. ఆ మేరకు బుధవారం తిరుపతిలోని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసంలో తిరుపతి, చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ మంత్రులు నారాయణస్వామి, ఆర్‌కే రోజా, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప, తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, భూమన అభినయరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్, వెంకటేగౌడ్, నూకతోటి రాజేష్, కృపాలక్ష్మి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు చంద్రమౌళిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బీరేంద్రవర్మ, తిరుపతి నగర పార్టీ అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి సమావేశమయ్యారు. రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు మామిడి దిగుబడులకు గుజ్జు పరిశ్రమల వారు కిలో మామిడికి రూ.8, ప్రభుత్వం రూ.4 చెల్లించాల్సి ఉంది. మామిడి దిగుబడులు విక్రయించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క రూపాయి చెల్లించకపోవటాన్ని తీవ్రంగా పరిగణించారు.

ఇంకా రైతు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవటం, యూరియా దొరక్క తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాలపై చర్చించారు. రైతు సమస్యల పరిష్కారం ఈనెల 9న ఆర్డీఓ కార్యాలయాల వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు రైతులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. పలమనేరులో రీజనల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ్, శ్రీకాళహస్తిలో తిరుపతి, చిత్తూరు జిల్లా అధ్యక్షులు, మాజీ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, నగరిలో మాజీ మంత్రి ఆర్‌కే రోజా, జీడీ నెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి, చిత్తూరులో మాజీ మంత్రి నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్, కుప్పంలో మాజీ ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్, తిరుపతిలో నియోజక వర్గ సమన్వయకర్త భూమన అభినయ రెడ్డి, చంద్రగిరి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

జాతర ఏర్పాట్లపై దిశా నిర్దేశం

- పోలేరమ్మ జాతర విజయవంతం చేద్దాం



జాతర గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ, ఎమ్మెల్యే

వెంకటగిరి (సైదాపురం) : ప్రసిద్ధి చెందిన వెంకటగిరి శక్తి స్వరూపిణి పోలేరమ్మతల్లి జాతర ఏర్పాట్లపై బుధవారం అధికారులకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ దిశానిర్దేశం చేశారు.ఈనెల 10, 11 తేదీలలో వెంకటగిరిలో జరగనున్న పోలేరమ్మ జాతర మహోత్సవానికి సంబంధించి పట్టణంలో పలు శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. పోలేరమ్మ జాతరకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూ. 40 లక్షలు నిధులు మంజూరు చేసిందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. మహిళలకు అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. జాతర విజయవంతం అయ్యేందుకు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన ప్రత్యేక బాధ్యత తీసుకుంటారన్నారు. గత పొరపాట్లు పునరావృతం కాకుండా నిర్వహణ గత ఏడాది జరిగిన పోలేరమ్మ జాతరలో పొరపాట్లు పునరావృతం కాకుండా ఈ ఏడాది సమర్థవంతంగా పోలీసు బందోబస్తు ఏర్పాట్లను చేస్తున్నట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. పట్టణంలో సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ.. ఈ ఏడాది వీఐపీ దర్శన క్యూలైన్లు రద్దు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం అమ్మవారి జాతరకు సంబంధించి గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ గీతాకుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ భానుప్రియ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి రూ.1.65 కోట్లు మంజూరు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పోలేరమ్మతల్లికి సంబంధించి ఆలయ పరిపాలన భవనం, కల్యాణ మండపం, వాణిజ్య సముదాయానికి సంబంధించి రూ. 1.65 కోట్ల నిధులు మంజూరైనట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. పట్టణంలోని పీవీ మెస్ పక్కన ఉన్న స్థలాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే, దేవాదాయశాఖ , మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. వెంకటగిరి పోలేరమ్మ తల్లికి సంబంధించి పట్టణంలో కమర్షియల్ కాంప్లెక్స్, కళ్యాణ మండపం, పరిపాలన భవనం నిర్మాణానికి దేవాదాయశాఖ నుంచి రూ. 1.10 కోట్లు , పోలేరమ్మతల్లి దేవస్థానం నుంచి రూ. 40 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీన, తహసీల్దార్ నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

పోలేరమ్మతల్లి జాతర రెండో చాటింపు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి శ్రీ పోలేరమ్మతల్లి జాతర సందర్భంగా బుధవారం అర్ధరాత్రి దేవాదాయశాఖ అధికారులు , అమ్మవారి సేవకుల సమక్షంలో పట్టణంలోని కాంపాళెం కామాక్షమ్మ గుడి వద్ద రెండో చాటింపు వైభవంగా జరిగింది. అమ్మవారి జాతర వచ్చే బుధవారం జరుగుతుందంటూ తప్పెట్లు, కిలారింపు అరుపులతో కోలాహలంగా నిర్వహించారు.

ఔషధ నియంత్రణ అధికారుల దాడులు



మందులను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

తిరపతి తుడా : తిరుచానూరులోని పద్మావతి ఇంటిగ్రేటెడ్ పోలీ హాస్పిటల్ ప్రాంగణంలోని శ్రీ పద్మావతి ఫార్మసీపై ఔషధ నియంత్రణ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఫార్మసీలో అబార్షన్ మందులు, సరైన కొనుగోలు రికార్డులు లేకుండా పలు రకాల ఔషధాలు నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా కేసు నమోదు చేశారు. దీంతో పాటు తదుపరి విచారణలో డాక్టర్ శైలజ (హోమియోపతి వైద్యురాలు) తన వద్దకు వచ్చిన రోగులపై అబార్షన్ మందులను దుర్వినియోగం చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై పూర్తి స్థాయి విచారణ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. దాడి సమయంలో 15 ఇన్వాయిస్‌లు, 18 రకాల మందులు కొనుగోలు ఇన్వాయిస్ లేకుండా నిల్వ ఉంచిన వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో డ్రగ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ హరిప్రసాద్, తిరుపతి గ్రామీణ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసులు పాల్గొన్నారు.

కార్మికులకు సరైన భద్రత కల్పించండి : జేసీ

తిరుపతి అర్బన్: కార్మికులకు సరైన భద్రత కల్పించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సూచించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీతో సమీక్షించారు. పరిశ్రమల పరిశీలన కమిటీకి అందిన మేరకు 46 పరిశ్రమలకు ప్రోత్సాహకాలు రూ.4.43 కోట్లు అందించడానికి ఆమోదం తెలిపినట్లు చెప్పారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజర్ విజయభరత్ రెడ్డి, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రామకృష్ణ రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, రవాణా శాఖ అధికారి మురళీమోహన్, ఎల్‌డీఎం రవికుమార్ పాల్గొన్నారు.

కలంపై కక్ష!


- వార్తలు రాస్తే కేసులా?
- పోలీసులకు జరిగిన అన్యాయాన్ని ప్రచురిస్తే నిర్బంధమా?
- తిరుపతి పోలీస్ స్టేషన్‌లో పాత్రికేయుల ఫిర్యాదు
- సాక్షి ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్



ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసులకు వినతిపత్రాన్ని ఇస్తున్న తిరుపతి జర్నలిస్టులు

తిరుపతి అర్బన్ : ఇదేమి రాజ్యం.. పత్రికల్లో వార్తలు ప్రచురిస్తే కేసులు పెట్టి.. జర్నలిస్టులను భయపెట్టడం ఎంటీ సార్.. రాష్ట్ర చరిత్రలో ఓ వార్త ప్రచురించారని ఏకంగా ఎడిటర్‌పై కేసు పెట్టడం ఇప్పటివరకు జరగలేదు అంటూ తిరుపతి పాత్రికేయులు కూటమి ప్రభుత్వం వ్యవహారంపై తీవ్రమైన అసంతృప్తి వ్యక్తంచేశారు. పోలీస్ విభాగానికి సంబంధించి డీఎస్పీల పదోన్నతి అంశంలో జరుగుతున్న లోటుపాట్లతో పోలీస్ అధికారులకు జరుగుతున్న అన్యాయాన్ని సాక్షి పత్రికలో ఓ కథనం ప్రచురిస్తే.. అదే పోలీస్‌లతో అర్ధరాత్రి సమయంలో విచారణ చేపట్టడంతో పాటు ఏకంగా సాక్షి ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డితో పాటు సాక్షి పాత్రికేయులపై కేసులు పెట్టడంపై పాత్రికేయ సంఘాలు మండిపడ్డాయి. ఆ మేరకు బుధవారం తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్ వద్ద పలు సంఘాల ప్రతినిధులు అక్రమ కేసులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల వృత్తి సమాజంలో జరుగుతున్న మంచితోపాటు చెడును తెలియజేయడం ద్వారా అధికార యంత్రాంగం తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో పత్రికలు పనిచేస్తున్నాయని సంఘాల నేతలు గుర్తు చేశారు. అయితే ప్రభుత్వ ఆలోచన మాత్రం దురుద్దేశపూర్వకంగా ఉందని విమర్శించారు. తప్పిదాలు చోటు చేసుకున్నా, అవినీతి అక్రమాలు కొనసాగుతున్న వాటిని ప్రజలకు తెలియజేయకుండా... తప్పొప్పులతో సంబంధం లేకుండా ప్రభుత్వానికి భజన చేయాలని భావించడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. మీడియాపై కక్ష సాధింపులకు పాల్పడిన ఏ ప్రభుత్వానికి మనుగడ లేకుండా పోయిందని హెచ్చరించారు. సాక్షి ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అనంతరం ఈస్ట్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాసులకు అక్రమ కేసుల అంశాన్ని వివరించారు. పోలీసులకు మద్దతుగా కథనాలు రాస్తే.. అదే పోలీసును ఎడిటర్‌పై కేసులు పెట్టడం న్యాయమా అని ప్రశ్నించారు. ఆ మేరకు ఓ వినతిపత్రాన్ని ఆయనకు అందించారు. ఈ కార్యక్రమంలో సాక్షి పత్రిక బృందంతో పాటు తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆర్.మురళి, కార్యదర్శి పి.బాలచంద్ర, ఏపీ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.గిరిబాబు, ఏపీ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్ కల్లుపల్లి సురేంద్రరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యుడు మబ్బు నారాయణరెడ్డి, జర్నలిస్ట్ సంఘం నేతలు హేమంత్, ప్రసాద్ మోహన్, సుబ్రమణ్యం, చంద్రాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పోలీసుల కోసం ప్రశ్నిస్తే కేసులా?



పోలీసులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించిన మీడియాపైనే కేసులు పెడతారా. మీ సమస్యను మీరు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోలేరు. మీడియా ద్వారానైనా పరిష్కారం చూపాలని కథనాలు ఇస్తే.. పోలీసులు సాక్షి ఎడిటర్‌పై కేసులు పెట్టడం న్యాయం కాదు. పార్టీలను పక్కనపెట్టి పోలీసులు పారదర్శకంగా వ్యవహరించాల్సి ఉంది. తక్షణం పోలీసులు కేసును ఉపసంహరించుకోవాలి. పోలీసులు రాజకీయ నేతలకు తలొగ్గి మీడియాపై కక్ష పూరితంగా వ్యవహరించడం సరైంది కాదు.

– ఆర్.మురళి, తిరుపతి ప్రెస్‌క్లబ్, అధ్యక్షుడు


కేసులతో స్వేచ్ఛను హరించలేరు



మీడియాపై కేసులు పెట్టి భయపెట్టాలని చూడడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. వార్తలు ఏదైనా పొరపాటు ఉంటే ఖండన ఇవ్వడం పరిపాటి. అలా కాకుండా కేసులు పెట్టడం సరైంది కాదు. పోలీసులకు జరిగిన అన్యాయాన్ని ఎత్తి చూపడం తప్పుగా కనిపిస్తోంది. సాక్షిలో పోలీసుల పదోన్నతుల్లో కొందరికి అన్యాయం జరిగిందని వార్త ప్రచురించారు. అందులో ఏవైనా తప్పు ఉంటే సక్రమంగా చేశామని వివరణ ఇస్తే సరిపోతుంది . అలా కాకుండా కేసులు పెట్టడం న్యాయంగా లేదు.

– గిరిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్


మీడియాను భయపెట్టాలనుకోవడం మూర్ఖత్వమే



మీడియాను భయపెట్టి తమ చేతుల్లో ఉంచుకోవాలని కూటమి ప్రభుత్వం భావిస్తే అది కుదరదు. ఏ పత్రిక అయినా సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ఎత్తి చూపుతుంటారు. ప్రభుత్వం చేస్తున్న లోటుపాట్లను ప్రచురిస్తారు. అయితే కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా ఏకంగా సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులను బనాయించడం ఏ మాత్రం మంచి పద్ధతి కాదని భావిస్తున్నాం.

-కల్లుపల్లి సురేంద్రరెడ్డి, ఏపీ మీడియా ఫెడరేషన్ రాష్ట్ర కో ఆర్డినేటర్

మంచి, చెడులను ప్రజలకు తెలియజేస్తుంటాం



ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రభుత్వం చేపడుతున్న మంచి, చెడు రెండింటినీ పత్రికలు ప్రజలకు తెలియజేస్తుంటాయి. అయితే సాక్షి పత్రికలో ఓ కథనం ప్రచురిస్తే.. కథనంలో తప్పులు ఉంటే వాటిపై ఖండన ఇవ్వడం పద్ధతిగా ఉంటుంది. అలా కాకుండా ఆ పత్రిక జర్నలిస్టులతో పాటు ఏకంగా ఎడిటర్‌పై కేసులు పెట్టడాన్ని ప్రజలు హర్షించరు.

– మబ్బు నారాయణరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ సభ్యుడు

క్లుప్తంగా

ముగ్గురు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక



అవార్డుకు ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులు

తిరుపతి సిటీ : తిరుపతి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రభుత్వం ముగ్గురిని ఎంపిక చేసింది. ఇందులో శ్రీకాళహస్తి మండలం దిగువ సంబేపల్లి ఎంపీపీఎస్‌లో ఎస్‌జీటీగా పనిచేస్తున్న బాలసుబ్రమణ్యం, శ్రీకాళహస్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామకృష్ణ, శ్రీకాళహస్తి మండలం ముచ్చివేలు జెడ్పీహెచ్ ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ సుబ్రమణ్య శర్మ ఎంపికయ్యారు. వీరు విజయవాడలో శుక్రవారం జరగనున్న ఉపాధ్యాయ దినోత్సవంలో రాష్ట్ర స్థాయి ప్రతిభా పురస్కారాలు అందుకోనున్నారు.

నిమజ్జనంలో విషాదం




మృతుడు జశ్వంత్‌కుమార్

కోట: మండలంలోని శ్రీనివాససత్రం బీచ్‌లో వినాయక నిమజ్జనంలో విషాదం చోటుచేసుకుంది. వివరాలు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు మండలం మిక్స్‌డ్ కాలనీకి చెందిన నన్నం రామయ్య, మంగమ్మ దంపతుల కుమారుడు జస్వంత్ కుమార్(16) వినాయకుని విగ్రహం సముద్రంలో నిమజ్జనం చేసేందుకు స్థానికులతో కలసి శ్రీనివాస సత్రం బీచ్‌కు వచ్చాడు. విగ్రహాన్ని సముద్రంలో నిమజ్జనం చేసే సమయంలో అలల తాకిడి ఎక్కువగా ఉండడంతో ఊపిరాడక సొమ్మసిల్లి పడిపోయాడు. అతన్ని ఒడ్డుకు చేర్చి చికిత్స కోసం గూడూరుకు తరలిస్తుండగా మృతిచెందాడు.

అయ్యోర్ల అయోమయం !

- అర్హులకు అవార్డులు వరించేనా?
- జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాలపై సందిగ్ధం
- ఎవరికి వరిస్తుందో తెలియని గందరగోళం
- పార్టీ అనుచరులనే ఎంపిక చేయనున్నట్లు ఆరోపణలు
- ఆందోళన చెందుతున్న ఉపాధ్యాయులు
- రేపు ఉపాధ్యాయ దినోత్సవం



తిరుపతి సిటీ : గురువు అనే పదానికి అర్థమిచ్చేలా జిల్లా అధికారులు ప్రవర్తించాలి అంటూ తిరుపతి జిల్లాలోని ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. రాజకీయ, కుల, సామాజిక వర్గాలకు అతీతంగా ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయాలని కోరుతున్నారు. జిల్లాలో ప్రాథమిక, ఉన్నత విద్యను విద్యార్థులకు అందించే నేపథ్యంలో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు ఏటా సెప్టెంబర్ 5న సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జయంతి సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తారు. ఇందులో భాగంగా తిరుపతి జిల్లాలో 2025–26 సంవత్సరానికి సంబంధించి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక రాజకీయ, కుల సమీకరణాలతో ముడిపడుతున్నట్లు ఉపాధ్యాయుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇప్పటికే జిల్లా నుంచి ఇన్‌చార్జి మంత్రి, స్థానిక నాయకుల పర్యవేక్షణలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ పూర్తైనట్లు సమాచారం.

అర్హులకు మొండిచెయ్యేనా !

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక ఈ ఏడాదైనా సక్రమంగా జరిగేనా అంటూ ఎదురు చూసిన గురువులకు నిరాశే ఎదురైనట్లు తెలుస్తోంది. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల కోసం జిల్లా నుంచి సుమారు 49 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 8 మందిని మాత్రమే జిల్లా విద్యాశాఖ రెఫర్ చేసింది. ఇందులో అధికార పార్టీ అనుచరులైన అదే సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయులను ఎంపిక చేసినట్లు ఉపాధ్యాయుల నుంచి ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అలాగే గతేడాది సుమారు 75 మందిని ఎంపిక చేసిన జిల్లా విద్యాశాఖాధికారులు అందులో అధికారిక పార్టీకి చెందిన వారే సుమారు 80శాతం ఉన్నారు. ఈ ఏడాది జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక కోసం సుమారు 120 మంది దరఖాస్తు చేసుకోగా అందులో సామాజిక సమీకరణాలు, రాజకీయ నాయకులు ఒత్తిడితోనే పూర్తి స్థాయి ఎంపికలు జరిగినట్లు సమాచారం.

దరఖాస్తు చేసుకోనివారు వెయ్యి మందిపైనే...

జిల్లాలో కుల ప్రాతిపదికన, అధికార పార్టీకి అనుచరులుగా గుర్తింపు పొందిన వారిని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తున్నారని, అందుకే తాము కనీసం దరఖాస్తు చేసుకోలేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయటపడి స్వరం వినిపిస్తే దారుణంగా వ్యవహరిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతారనే భయంతో తాము చెప్పుకోవడలేదని వాపోతున్నారు. దీంతో సుమారు అర్హులైన వెయ్యి మంది ఉపాధ్యాయులు ఉత్తమ అవార్డులకు దరఖాస్తు చేసుకోలేక మధనపడుతున్నారు.

జిల్లా సమాచారం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు 3021	ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు 7901
ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులు సుమారు	1012
రాష్ట్ర స్థాయి అవార్డులకు దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య	49 మంది
జిల్లా విద్యాశాఖ రాష్ట్ర స్థాయి అవార్డులకు రెఫర్ చేసిన వారి సంఖ్య	8
జిల్లా స్థాయి అవార్డులకు దరఖాస్తు చేసుకున్నవారు	120 మంది
గత ఏడాది అవార్డులు పొందిన వారు	75 మంది

ఉత్తమ అవార్డులలోనూ రాజకీయమా ?

విద్యార్థుల ఔన్నత్యానికి పాటుపడిన ఉపాధ్యాయులను విస్మరించి, రాజకీయ రంగు పులుముకున్న వారికి అవార్డులు ఇస్తూ గురువు అనే పదానికే అర్థం మార్చేస్తున్నారు. గత ఏడాది జిల్లాలో సుమారు 75 మందికి పైగా ఉత్తములంటూ అవార్డులు ప్రభుత్వ ప్రకటించడం దారుణం. ఇందులో కనీసం 56 మంది రాజకీయ నాయకులు ప్రోత్సాహంతో ఉత్తములుగా అవార్డులు పొందారు. ఇంత దారుణంగా గతంలో ఎప్పుడు జరగలేదు. ఈ ఏడాదైనా అర్హులను గుర్తించి ప్రభుత్వం ఉత్తములుగా అవార్డులు అందిస్తుందని ఆశిస్తున్నాం.

– ఉపాధ్యాయ సంఘాలు, తిరుపతి జిల్లా

పారదర్శకంగానే ఉత్తముల ఎంపిక

జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక పారదర్శకంగా జరిగింది. జిల్లాలో అర్హులైన ప్రతి ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని కోరాం. ఆ విధంగా దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కమిటీని ఏర్పాటు చేసి ఉత్తమ అవార్డులకు అర్హులైన ఉపాధ్యాయుల జాబితాను ప్రభుత్వానికి పంపాం. ఇందులో ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు.

– కేవీఎన్ కుమార్, డీఈఓ, తిరుపతి జిల్లా

కొండపై తట్టకోసమేనా ఈ ఆరాటం

- దళారీ బతుకును మరిచావా కిరణ్ రాయల్ ?
- సుగాలి ప్రీతి చనిపోయింది చంద్రబాబు ప్రభుత్వంలోనే అని తెలుసుకో
- భూమన కుటుంబాన్ని విమర్శించే స్థాయి నీకు ఉందా?
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి వాసు యాదవ్ ధ్వజం



మీడియాతో మాట్లాడుతున్న వాసు యాదవ్

తిరుపతి మంగళం : కొండపైన తట్ట కోసం, దర్శనాల టిక్కెట్ల కోసం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మెప్పు పొందేందుకు కరుణాకర్ అన్నపై అవాకులు చవాకులు మర్యాదగా ఉండదని కిరణ్‌రాయల్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్ హెచ్చరించారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. ''తిరుపతిలో సినిమా థియేటర్ల వద్ద బ్లాక్ టికెట్లు, కొండ దర్శనం టికెట్లు అమ్ముకున్న దళారీ బతుకును మరిచావా కిరణ్ రాయల్. దుబాయ్, సింగపూర్ ముఠాలతో సంబంధాలున్నట్లు రాష్ట్రమంతా కోడై కూస్తోంది. భూమన కరుణాకర రెడ్డి అన్నను విమర్శించే స్థాయి నీదా? కొండపైన బ్లాక్ టికెట్లు అమ్ముతూ పోలీసులకు దొరికితే విడిపించమని కరుణన్నను కాళ్ల పట్టుకుని ప్రాధేయపడిన సంగతి మరిచావా? 2017లో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో సుగాలి ప్రీతి చనిపోతే ఆ సంఘటనను మా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో అని మాట్లాడడం సిగ్గుచేటు. జగనన్న అధికారంలోకి వచ్చాకే సుగాలి ప్రీతి కుటుంబానికి 5 ఎకరాల పొలం, ఐదు సెంట్ల ఇంటి స్థలం, రెవెన్యూలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇప్పించిన గొప్ప వ్యక్తి జగనన్న. కరుణాకర్ అన్న లాంటి పెద్దవాళ్లను విమర్శించి ఫేమస్ అవ్వాలనుకుంటే తిరుపతి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. జనసేన పార్టీ నుంచి నిన్ను బహిష్కరించినా సిగ్గు లేకుండా జనసేన కార్యకర్త అని చెప్పుకుని మైకుల ముందు నోటికొచ్చినట్లు మాట్లాడడం సిగ్గు చేటు'' అంటూ వాసు యాదవ్ ధ్వజమెత్తారు.

11న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం సమావేశం



జిల్లా ఎస్సీ విభాగం సమావేశానికి పెద్దిరెడ్డి, రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, ఆర్‌కె. రోజాలతో పాటు సమన్వయకర్తలను ఆహ్వానిస్తున్న తలారి రాజేంద్ర, మల్లారపు వాసు

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 11న తిరుపతి పద్మావతి పురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఎస్సీ విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ ఎస్సీ విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు తలారి రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి మల్లారపు వాసు తెలిపారు. ఈ మేరకు బుధవారం తిరుపతి మారుతీనగర్‌లోని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసం వద్ద పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ మంత్రి ఆర్‌కె. రోజా, మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎంపీ రెడ్డప్ప, మాజీ ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వెంకటేగౌడ్, డాక్టర్ సునీల్, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, నూకతోటి రాజేష్, కృపాలక్ష్మి, మేయర్ డాక్టర్ శిరీషను కలిసి ఆహ్వానించారు. ఈ సమావేశానికి పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టిజెఆర్. సుధాకర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు పాల్గొంటారని రాజేంద్ర తెలిపారు. సమావేశానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఎస్సీ విభాగం నాయకులు తరలిరావాలని కోరారు.

టింబర్ ఉడ్ ప్లాంటేషన్‌పై దృష్టిసారించండి



సమావేశానికి హాజరైన అటవీశాఖ అధికారులు, రైతులు

తిరుపతి మంగళం : సాధారణ వ్యవసాయం తరహాలోనే టింబర్ ఉడ్ ఆధారిత ప్లాంటేషన్‌పై దృష్టి సారించి, లాభదాయకంగా మార్చుకోవాలని అటవీశాఖ తిరుపతి సర్కిల్ పీసీఎఫ్ సెల్వం రైతులకు సూచించారు. తిరుపతిలోని బయోట్రిమ్ కార్యాలయంలో బుధవారం బెంగళూరుకు చెందిన ఐసీఎఫ్‌ఆర్‌ఈ–ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఉడ్‌సైన్స్ టెక్నాలజీ సహకారంతో తిరుపతి అటవీశాఖ జిల్లా రైతులకు నర్సరీల ఏర్పాటు, వెదురు, శ్రీగంధం, ఎర్రచందనం మొక్కల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుపతి, చిత్తూరు పరిధిలో ఎర్రచందనం పెంపకంపై దృష్టిసారించినా, అమ్మకాల్లో అంతర్జాతీయ డిమాండుకు తగ్గట్టు లాభాలు రావడంలేదనో, కటింగ్ పర్మిషన్ ఇబ్బందనో, కొనేందుకు బయ్యర్స్ ముందుకు రావడంలేదనో ఎక్కువగా రైతులు అటువైపు మొగ్గు చూపడంలేదన్నారు. ఎర్రచందనాన్ని కూడా ఒక సాధారణ టింబర్ ఉడ్‌గా భావించి పెంచితే సాధారణ ఉడ్ ట్రీల కంటే ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. అయితే వెదురు, శ్రీగంధం పెంపకం చేపట్టినా లాభదాయకంగా ఉంటాయన్నారు. ఏటా 5 కోట్ల మొక్కలను నాటించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు అందిపుచ్చుకుంటే టింబర్ ఉడ్ మొక్కల పెంపకంలో లాభాలను చూడవచ్చునని తెలిపారు. బయోట్రిమ్ స్టేట్ సిల్వికల్చరిస్ట్ నరేందిరన్ మాట్లాడుతూ.. ఏనుగుల వలన నష్టంలేని ఉడ్ బేస్డ్ వెదురు పెంపకాన్ని రైతులు చేపడితే లాభాలు గడించవచ్చునని చెప్పారు. సినిమాలు చూసి ఎర్రచందనం రేటును ఊహించుకుని రైతులు నష్టపోతున్నారన్నారు. జిల్లా హార్టికల్చరల్ అధికారి దశరథరామిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో వెదురు పెంపకంపై రైతులకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని, హెక్టారుకు రూ.32 వేలు రాయితీ రైతులకు అందజేస్తామన్నారు. జిల్లాలో 12 హెక్టార్లలో వెదురు పెంపకం లక్ష్యంగా ఉండేదని ఆసక్తి ఉన్న రైతులు ముందుకు రావాలని సూచించారు. సదస్సులో అసిస్టెంట్ స్టేట్ సిల్వికల్చరిస్ట్ పవన్‌కుమార్‌రావు, సబ్ డీఎఫ్‌వో నాగభూషణం, ఐడబ్ల్యూటీ శాస్త్రవేత్త లక్ష్మీనరసింహమూర్తిదొరై, ఏసీఎఫ్ సోమశేఖర్, రేంజర్లు లక్ష్మీపతి, లక్ష్మప్ప, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ

తిరుపతి కల్చరల్ : అధికారులు నిబద్ధతతో పనిచేయాలని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి పి.సత్యనారాయణ పిలుపు నిచ్చారు. తుడా కార్యాలయం ఆవరణలోని ఆడిటోరియంలో బుధవారం రాయలసీమ జిల్లాలు తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, కడప జిల్లాలకు చెందిన బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారులు, సహాయ సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులకు ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సంక్షేమ అధికారులు వసతి గృహ విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధి కోసం పాటు పడాలన్నారు. వసతి గృహాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని సంక్షేమ అధికారులను కోరారు. అనంతరం బీసీ సంక్షేమ డైరెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ.. వసతి గృహాల్లో ట్యూటర్లను నియమించి మంచి ఫలితాలు సాధించాలన్నారు. సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ డి.చంద్రశేఖర్ రాజు మాట్లాడుతూ.. ప్రతివారం పరీక్షలు నిర్వహించి మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. పద్మావతి మహిళా కళాశాల ప్రిన్సిపల్ భువనేశ్వరి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు పెంపొందించాలన్నారు. స్విమ్స్ వైద్య కళాశాల గుండె వైద్య నిపుణురాలు ప్రొఫెసర్ వనజ మాట్లాడుతూ.. యోగా, ధ్యానం, ఆహారపు అలవాట్ల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాఘవేంద్ర మీరా, జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి ఎం.భరత్ కుమార్‌రెడ్డి, రాయలసీమ జిల్లాల వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా



బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని తానిగిల్లు గ్రామం వద్ద కేటీ రోడ్డు మలుపు వద్ద బుధవారం తెల్లవారుజామున టైల్స్ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. లారీలోని డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తిరుపతి నుంచి టైల్స్ లోడ్‌తో శ్రీసిటీకి వెళ్తుండగా తానిగిల్లు వద్ద గల ప్రమాదకర మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టినా అరెస్టు చేయరా?



దుర్గసముద్రం దళితవాడలో బాధిత కుటుంబికులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం నేతలు



దళితవాడకు చెందిన వరలక్ష్మి ఇంటి కిటికీలను ధ్వంసం చేయడంతో ఆ ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సీ సెల్ నాయకులు

- కళ్లముందరే నిందితులు తిరుగుతున్నా పట్టించుకోరా?
- దుర్గసముద్రం దళితులకు హోంమంత్రి అనిత న్యాయం చేయాలి
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్ర డిమాండ్

తిరుపతి రూరల్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులపై జరుగుతున్న దాడులకు హోం మంత్రి అనిత సమాధానం చెప్పాలని, ముఖ్యంగా దుర్గసముద్రంలోని దళితవాడపై అగ్రకులాల దాడి ఘటనపై ఆమె స్పందించాలని జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజేంద్ర డిమాండ్ చేశారు. తిరుపతి రూరల్ మండలం దుర్గ సముద్రం గ్రామంలోని దళితవాడలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం నేతలు పర్యటించారు. ముందుగా అగ్ర కులాలకు చెందిన వారు దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలైన వారిని పరామర్శించి గ్రామంలో ధ్వంసమైన ఇళ్లను పరిశీలించారు. అనంతరం అక్కడే పికెట్ నిర్వహిస్తున్న పోలీసులతో మాట్లాడి దళితులకు రక్షణగా నిలబడాలని, అగ్ర కులాలపై చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేయకుండా వారిని అరెస్టు చేసి జైలుకు పంపాలన్నారు. అంతకు ముందు బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు ఎస్సీసెల్ కమిటీ సభ్యులతో మాట్లాడుతూ.. తాము గ్రామంలో తాగునీరు పట్టుకునేందుకు వెళ్లినా కులం పేరిట అవమానాలకు గురిచేస్తున్నారని, దూరంగా ఉండాలని, తమను మానసికంగా హింసిస్తున్నారని చెప్పారు. దీనిపై స్పందించిన ఎస్సీ సెల్ నేతలు ఆ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మీడియా ప్రతినిధులతో వారు మాట్లాడుతూ.. దళితవాడపై టీడీపీ సానుభూతి పరులైన అగ్రకులాలకు చెందిన వారు కర్రలు, రాడ్లు, రాళ్లతో విచక్షణా రహితంగా దాడులు చేసి గాయపరిస్తే పోలీసులు అట్రాసిటీ కేసులు పెట్టి చేతులు దులిపేసుకున్నారన్నారు. ఆ కేసులో నిందితులు కళ్లముందే తిరుగుతున్నా పోలీసులు అరెస్టు చేయడం లేదన్నారు. దాడిలో భాగస్వాములైన వారందరినీ పోలీసులు అరెస్టు చేసి దళితులకు రక్షణ కల్పిస్తూ న్యాయం చేయాలన్నారు. అలా చేయని పక్షంలో తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. దాడుల్లో గాయపడిన బాధితులకు అండగా నిలబడతామన్నారు. పర్యటనలో ఎస్సీ సెల్ నేతలు శెల్వం, మల్లారపు వాసు, శివలతో పాటు అదే గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సీపీ నేత జ్యోతి రెడ్డిలు వున్నారు.

పోలీసులు ప్రజలతో మమేకం కావాలి

గూడూరు రూరల్ : నేరాల నియంత్రణకు పోలీసులు ప్రజలతో మమేకం కావాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. బుధవారం గూడూరు రూరల్, ఒకటవ, రెండో పట్టణ పోలీసు స్టేషన్లను ఎస్పీ తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్లలోని పలు రికార్డులను పరిశీలించారు. సాయంత్రం సమయంలో పార్కుల్లో వాకింగ్ చేస్తున్న వృద్ధులతో మాట్లాడుతూ.. వారి సమస్యలను తెలుసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. రాత్రి సమయంలో పల్లె ప్రజలతో మమేకం అవుతూ ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై అప్రమత్తంగా ఉండాలని, అలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించొద్దన్నారు. గంజాయి స్థావరాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, గంజాయి కేసుల్లో జైలుకు వెళ్లి బయటకు వచ్చిన వారిపై నిఘా ఉంచి నిరంతరం గమనిస్తూ ఉండాలని ఆదేశించారు. రాత్రి సమయంలో గస్తీ పెంచాలని పేర్కొన్నారు. రౌడీ షీటర్ శ్రీకాంత్‌కు సంబంధించి తిరుపతి జిల్లాలో నేర సామ్రాజ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఇప్పటికే కొంత మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. సూళ్లూరుపేటలో జరిగిన కేసుకు సంబంధించి రీ ఇన్వెస్టిగేషన్ చేస్తున్నామన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్పీ వెంట గూడూరు డీఎస్పీ గీతా కుమారి, సీఐలు కిషోర్ బాబు, శేఖర్‌బాబు, శ్రీనివాస్, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతో డయేరియా విజృంభణ

- వైద్యాధికారుల నిర్లక్ష్యంపై మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం



బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట : రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే గ్రామాల్లో పారిశుద్ధ్య లోపంతో డయేరియా విలయ తాండవం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. రేణిగుంట మండలంలోని గుత్తివారిపల్లిలో ఇప్పటి వరకు 70 మందికి డయేరియా వ్యాపించగా అందులో ఒకరు మృతి చెందారు. బాలాజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితులను బుధవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న బాధితులకు పండ్లు, ఓఆర్‌ఎస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వైద్య రంగంలో వైఫల్యం చెందిందన్నారు. గత ప్రభుత్వంలో ఫ్యామిలీ డాక్టర్ పేరుతో ప్రతి ఇంటికి వైద్యుడిని పంపించి జగనన్న చికిత్స అందించారని గుర్తు చేశారు. డాక్టర్, సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు వారానికి ఒకసారి ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ప్రభుత్వ రికార్డులలో నమోదు చేసేవారని తెలిపారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదని ఎక్కడ చూసినా విష జ్వరాలు, ఆరోగ్య సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరూ కోలుకునే విధంగా కలెక్టర్, వైద్యాధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యం లోపించిందని జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని మరొక గ్రామంలో ఈ విధంగా జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు తిరుమలరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ సిద్ధగుంట సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సింగల్ విండో అధ్యక్షుడు గణేష్ రెడ్డి, సర్పంచ్ మంజుల, సీనియర్ నాయకులు గంగయ్య, యోగేశ్వర్ రెడ్డి, గుణశేఖర్ రెడ్డి, రేణిగుంట సర్పంచ్ నగేషం, ముస్లిం మైనార్టీ పట్టణ అధ్యక్షుడు రఫీ ఉల్లా, మునిరెడ్డి పాల్గొన్నారు.

కూటమి అరాచకాలకు చరమగీతం పాడుదాం

- నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

రాపూరు/సైదాపురం : కూటమి అరాచకాలకు రాష్ట్ర ప్రజలు విసిగి వేసారిపోతున్నారని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టిస్తుందని నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాపూరులోని బత్తిన పట్టాభిరామిరెడ్డి నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కాకాణి మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు, నాయకులను ఇబ్బందులు పెట్టే దిశగా కూటమి ప్రభుత్వ కుట్రలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా అరాచకాలను చంద్రబాబు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. యూరియా కోసం రైతులు క్యూలైన్‌లో ఇబ్బందులు పడుతుంటే ఆ సమస్యను పరిష్కరించాల్సిన ఆశాఖ మంత్రి అచ్చెంనాయుడు రైతులను అవహేళనగా మాట్లాడం సమంజసం కాదని ఆరోపించారు. 2027 జమిలీ ఎన్నికల్లో రామ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెంకటగిరి నుంచే గెలుపు ఆరంభం కానున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కాకాణి పూజిత, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నేతలు బత్తిన పట్ల పట్టాభిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాపర్ తీగల చోరీలో నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం) : శ్రీసిటీ పారిశ్రామికవాడలోని సియోన్ పరిశ్రమలో ఇటీవల జరిగిన కాపర్ తీగల చోరీలో ఐదుగురు నిందితులతో పాటు మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అరుణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆగస్టు 29న సియోన్ పరిశ్రమలో ఎలక్ట్రిక్ తీగలను వేరు చేసి అందులోని కాపర్ తీగలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్ఐ అరుణ్‌కుమార్ రెడ్డి దర్యాప్తు చేపట్టారు. ఆ మేరకు బుధవారం సత్యవేడు మండలం మల్లవారి పాళెం ఈస్ట్‌కు చెందిన వెట్టి శరవణ, మల్లవారిపాళెం టౌన్‌షిప్‌కు చెందిన ఎం.రాజేష్, ఇరుగుళం గ్రామానికి చెందిన జి.జానకిరామన్, తడ మండలం వేనాడు గ్రామానికి చెందిన కుదిరి పోతయ్య అలియాస్ నాగరాజు, సూళ్లూరుపేట మండలం పేర్నాడుకు చెందిన నవీన్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వారి వద్ద ఉన్న రూ.2 లక్షలు విలువైన 200 కాపర్ వైర్లు, మూడు మోటారు బైకులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం వారిని సత్యవేడు కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు. కేసు ఛేదించడంలో సహకరించిన పోలీస్ సిబ్బంది ముత్తు, మునిశేఖర్, హరిబాబు, రాజశేఖర్, రాజును జిల్లా ఎస్పీ అభినందించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.